క్లుప్తంగా

స్వచ్ఛందంగా తొలగించుకోండి

పులివెందుల టౌన్ : పట్టణం అభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణకు సంబంధించి పార్నపల్లె రోడ్డు, విజయ హోమ్స్, రాణితోపు రోడ్లకు సంబంధించి భూసేకరణ పూర్తయ్యిందని.. భూసేకరణలో భాగమైన వ్యక్తులు తమ నిర్మాణాలకు సంబంధించి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆర్డీఓ వెంకటేశులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రెండు రోజుల్లో స్వచ్ఛందంగా తమకు సంబంధించిన నిర్మాణాలను తొలగించాలని.. లేకపోతే తర్వాత ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలను తొలగిస్తుందని ఆయన తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొండాపురం : మండలంలోని టి.కోడూరు గ్రామ సమీపంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2600 నగదు స్వాధీనం చేసుకుని కేసును మోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జె.రవికుమార్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొండాపురం : స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం 1987–1988లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఎం.ఓబులేసు, స్థానిక ప్రధానోపాధ్యాయుడు రామయ్యలు హాజరై మాట్లాడారు. గురువులకు కృతజ్ఞతలు తెలుపడానికి ఇటువంటి సమ్మేళనం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు తమ భావాలను పంచుకున్నారు. కార్యక్రమంలో గురువులు సోమకృష్ణారెడ్డి, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, ప్రమీల, వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు సత్కరించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్

పెండ్లిమర్రి : మండలంలోని రేపల్లె గ్రామానికి చెందిన చావలి రవి, పుల్లీర్పు ఆనంద్‌లు రాయచోటి వద్ద పెట్రోల్ ట్యాంక్‌లో పడి ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులకు మంగళవారం ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, అధికారులు తక్షణ సాయంగా వైఎస్సార్ బీమా కింద ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ రామాంజనేయరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగమల్లారెడ్డి, సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ జయలక్ష్మి పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



ఉదయ్‌కిరణ్

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న వెంపటి ఉదయ్‌కిరణ్‌కు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉదయ్‌కిరణ్ శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ జంతు శాస్త్ర విభాగంలో రిటైర్డు ప్రొఫెసర్ కె.యల్లమ్మ మార్గదర్శకత్వంలో ×రెడ్ గ్రేప్ సీడ్ ఎక్స్‌ట్రాక్ట్ (విటిస్ వినిపెరా ఎల్) హ్యాజ్ ఏ మెమరి ఎన్‌హాన్సింగ్ కాంపౌండ్ ఇన్ ఆల్బినో రాట్స్(నిస్టార్ స్ట్రెయిన్)–విత్ రిఫరెన్స్ టు అల్జీమర్స్ డిసీజ్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఉదయ్‌కిరణ్ యూనివర్శిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ దామ్లా నాయక్ చేతులమీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. తమ కళాశాల అధ్యాపకుడు డాక్టరేట్ రావడంపట్ల కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

హజ్ యాత్రికులపై దాడి దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాజస్థాన్ రాష్ట్రంలోని కోట జిల్లా కేంద్రంలో హజ్ యాత్రికులపై దాడి జరగడం దారుణమని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మహ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హజ్‌యాత్రకు బయలుదేరిన ముస్లిం మాత్రికులపై పాశవికంగా దాడి చేసిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భజరంగ్‌దళ్ వెంటనే నిషేధించాలన్నారు. ఈ ఏడాది చివర్లో రాజస్థాన్‌లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఇలాంటి దాడులను మోదీ ప్రభుత్వం చేయిస్తోందని ఆరోపించారు.

భూ మాఫియాను అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో భూ మాఫియాను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడానికి, రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వడానికి నిరాకరిస్తున్న అధికారులు విలువైన ప్రభుత్వ భూములు అక్రమించి తప్పుడు పత్రాలను సృష్టించి అమ్ముతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు విధిగా నిర్వహించి ఎమ్మెల్యే నేతృత్వంలో ఆర్‌డిఓ, ఎమ్మార్వో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి అర్హున పేదలకు రెండు ఎకరాల సాగు భూమిని పంపిణీ చేశారని గుర్తు చేశారు.

ప్రజలు మెచ్చే విధంగా పరిపాలన

- నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాల అమలు
- కేక్ కటింగ్‌లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు మెచ్చే విధంగా పరిపాలన అందించారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్టీ శ్రేణుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనగన్న తాను చేసిన పాద యాత్రలో నేను విన్నాను..నేను ఉన్నాను..అని చెప్పిన జగనన్న ప్రజల సమస్యల పరిష్కారానికి నవరత్నాలతో కూడిన మెనిఫెస్టో విడుదల చేశారన్నారు. ఆ మెనిఫెస్టోను ఖురాన్‌గా, బైబిల్‌గా, భగవద్గీతగా భావించి అందులోని 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. చెప్పని హామీలు సైతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నో పార్టీలు విడుదల చేసిన మెనిఫెస్టోలు చూశాముగాని, అవి అధిక శాతం నెరవేర్చనివేనన్నారు. టీడీపీ నాయకుడు చంద్రబాబు 2014 ఎన్నికల్లో బూటకపు హామీలతో మెనిఫెస్టో విడుదల చేసి 2015లో ఆ వెబ్‌సైట్ నుంచి తొలగించాడన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన ప్రజలు మెచ్చుకునే విధంగా ఉండటంతో కాలర్ ఎగరేసుకుని ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కులమతాలు, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా జగనన్న అందిస్తున్నారని, పథకాలు అందిన వారంతో ఈ సంబరాలు జరుపుకోవాలని ఆయన కోరారు. ఎన్నికలు ఎపుడు వచ్చిన 175 సీట్లు గెలవడం ఖాయం అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి, వైస్ చైర్మన్లు మహ్మద్‌సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, కొండారెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, ఇర్ఫాన్, లక్ష్మీనారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, మైసూరారెడ్డి, మస్తానయ్య, రామసుబ్బారెడ్డి, మద్రిసుబ్బన్న, విజయేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు సంవత్సరాల పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు సంవత్సరాలు ప్రజలు ఎంతో సంతోషంగా ఉండటంతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో పడుతుండటంతో ప్రజలు ప్రభుత్వంపై ఎంతో నమ్మకంగా ఉన్నారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వృద్ధులు, విద్యార్థులు పాలాభిషేకం చేశారు. అనంతరం రామసుబ్బారెడ్డి కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తున్నాడన్నారు. నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీతోపాటు 108, ఫీజురింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటి పథకాలు తీసుకుని వచ్చి నిరుపేదలకు సైతం కార్పొరేట్‌వైద్యం ఉన్నత చదువులు అవకాశం కల్పించారన్నారు. ప్రస్తుతం ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో వైస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజలలో ఎక్కడా అసంతృప్తి లేదని ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ వైపు ముగ్గుచూపుతున్నారన్నారు.

సింహాద్రిపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేపట్టి నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో సింహాద్రిపురం గురిజాల రోడ్డులో మంగళవారం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ముల్లా మహమ్మద్, ముల్లా బిలాల్, నజీర్, మహబూబ్‌బాషా, ముబారక్, మాబు, షరీఫ్, సోహైల్, నవీద్, సుమైర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

కమలాపురం : వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభం అవుతుందని, పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కమలాపురం : వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి అల్లె రాజారెడ్డిని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. వెన్నెముక నొప్పితో బాధపడుతూ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం అప్పాయపల్లెలోని ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేముల : మండలంలోని గుండ్లపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జల్లా భీమాంజనేయరెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి గ్రామానికి చేరుకుని భీమాంజనేయరెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు

– ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పి.బొమ్మేపల్లి గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, అలాగే ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి కృతజ్ఞతలను స్వీకరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని వారిని కోరారు. అనంతరం వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి 4 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కార్యకర్తలు, అభిమానులతో కలసి కేక్ కట్‌సి నేడు దేశంలో ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకోవడం జరుగుతోందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రామనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

అంతర పంటల ద్వారా అధిక ఆదాయం



అంతర పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు

వేముల : అంతర పంటల సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గొందిపల్లె, వేముల గ్రామాల్లో రైతులు శాంతమ్మ, శేషారెడ్డిలు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన అంతర పంటలైన మోటుక, సజ్జ పంటలను ఆయన పరిశీలించారు. అలాగే భూమయమ్యగారిపల్లెలో రైతు యోగానందరెడ్డి సాగు చేసిన ఐదంతస్తుల నమూనా, అరటి పంటలను ఆయన సందర్శించారు. అనంతరం వేముల రైతుభరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించాలన్నారు. రైతుకు అధిక ఆదాయాన్ని ఇచ్చే మోడల్స్ వేయించాలని, భూమిలేని నిరుపేదలకు పెరటి తోటలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రవీంద్ర, చిరంజీవి, వెంకటేష్, ఉమాదేవి, రామ్మోహన్ నాయుడు, ఐసీఆర్పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చందన అలంకారంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



చందన అలంకారంలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

వేంపల్లె : స్థానిక గాండ్లవీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఆలయ అర్చకులు హరి ప్రవీణ్, శేషగిరిరావుల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దుగ్గన్నగారిపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, వెంకట దుర్గలు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమానికి మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు ఎస్.సాంబశివుడు, రాఘవరెడ్డి, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఉత్తమ సేవా పత్రాలు



ఎస్పీ అన్బురాజన్ నుంచి సేవా పత్రాలను అందుకుంటున్న కానిస్టేబుళ్లు

ఎర్రగుంట్ల : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసులరెడ్డి, కె. ఆంజనేయులు, ఆర్‌వీ ఆంజనేయులులకు జిల్లా ఎస్పీ అన్బురాజన్ నుంచి ఉత్తమ సేవా పత్రాలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మంజునాథ్‌రెడ్డి వీరిని అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. మూడేళ్ల మనుదీప్‌కు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అవసరమైన రూ.17.50లక్షలను మంగళవారం సాయంత్రం ఆయన వారి తల్లిదండ్రులు బాలాజీ, వెంకట లక్ష్మిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకాష్‌కు చెందిన వీరు నిరుపేదలని, ఆ జబ్బు నయం చేసుకునే స్తోమత వారికి లేదన్నారు. ఆపరేషన్‌కు అంతమొత్తం భరించలేమని తన వద్దకు వచ్చినపుడు, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి ఈ మొత్తాన్ని మంజూరు చేయించామన్నారు. అనంతరం బాలుడి తల్లిదండ్రులు బాలాజీ, వెంకటలక్ష్మి మాట్లాడుతూ మూడు రోజుల్లోనే ఆపరేషన్‌కు అయ్యే పూర్తి మొత్తాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. సుబ్బారెడ్డి, రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్

కడప స్పోర్ట్స్: తాడిపత్రిలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన 1వ రాయలసీమస్థాయి ఓపన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కడప నగర క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. కడప నగరంలోని ఉర్దూ నగరపాలక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఆరుగురు పతకాలు సాధించినట్లు శిక్షకుడు జంషీర్ తెలిపారు. మంగళవారం కడప నగరంలో వీరిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ అభినందించారు. సబ్‌జూనియర్ విభాగంలో ఎస్. అలకనంద స్వర్ణం, క్యాడెట్ విభాగంలో ఎస్. హలిమాసాదియ స్వర్ణం, ఎం. గంగామయి స్వర్ణపతకాలు సాధించారు. జూనియర్ విభాగంలో ఎస్. అఫ్జల్‌బాషా రజతం, సబ్‌జూనియర్స్‌లో ఎస్. దావూద్ కాంస్యం, కేడెట్ విభాగంలో ఎస్. అబ్దుల్ అహాద్ కాంస్యపతకం సాధించినట్లు శిక్షకుడు తెలిపారు. కోచ్ ఇర్ఫాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు వలంటీర్లే రథసారథులు

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



వలంటీర్లను సత్కరిస్తున్న ఓఎస్డీ, తదితరులు

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లే రథసారథులుగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అంతకమునుపు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం గురించి ప్రత్యేక దృష్టి సారించి కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతోందన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలను మరింత చేరువ చేశారన్నారు. గతంలో పింఛన్ల కోసం వృద్ధుల ఆగచాట్లు, ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా చూశామని గుర్తు చేశారు. కొత్తగా మంజూరైన పింఛన్లను కూడా జూన్ 1వ తేదీనుంచి వలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం సేవా వజ్రకు ఒకరు, సేవా రత్న 5 మంది, సేవా మిత్రల అవార్డులకు 347 మంది ఎంపికైన వలంటీర్లను శాలువాలతో సత్కరించి మెడల్స్‌ను అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, వలంటీర్లు, సచివాలయ ఉద్యో గులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల పనితీరు అమోఘం

వేంపల్లె : నవరత్నాల సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పనితీరు ఆమోఘమని ఎంపీటీసీ భారతి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉన్న సచివాలయం–7 పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వలంటీర్లను ఆమె శాలువాతో ఘనంగా సత్కరించారు. సేవామిత్ర, సేవారత్న అవార్డుల పత్రాలతోపాటు మెడల్స్‌ను వారికి అందించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఆంజనేయులు, పి.గణేష్, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొ న్నారు.

వలంటీర్ పాత్ర కీలకం

కొండాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు అమలు చేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీడీఓ నాగప్రసాద్‌లు తెలిపారు. స్థానిక సచివాలయంలో వలంటీర్లకు అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చింతా శంకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఎట శ్రీనివాసులురెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న వేద పండితులు

వేముల : మండలంలోని చాగలేరు గ్రామంలో సీతారాముల ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో రూ.35 లక్షలతో నూతనంగా ఈ దేవాలయాన్ని నిర్మించారు. విగ్రహ ప్రతిష్ట వేడుకలో భాగంగా రెండవ రోజు మంగళవారం వేద మంత్రాల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించారు. బుధవారం సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రేపు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహుని కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి క్షేత్రంలో స్వామి జయంతి సందర్భంగా గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నామని కార్యనిర్వాహకులు రేవిళ్ల సురేష్‌బాబు తెలిపారు. ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు స్వామి మూలమూర్తికి అభిషేకం, అనంతరం అలంకారం, అర్చన హారతి నిర్వహిస్తామన్నారు. ఉదయం 9. నుంచి కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని, 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం



కౌన్సిలర్లను సత్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల : వేసవికాలంలో కౌన్సిలర్లు ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వరుసగా రెండవ ఏడాది స్థానిక పాత ఆర్టీసీ బస్టాండు, నాలుగు రోడ్ల కూడలి వద్ద మున్సిపల్ కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్‌లు మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మజ్జిగ చలివేంద్రాలు 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కౌన్సిలర్లు కోడిరమణ, పార్నపల్లె కిశోర్‌లను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లతో కలిసి ఆయన శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి పాడి గేదెలు మృతి



మృతి చెందిన పాడి పశువులు



దగ్ధమవుతున్న గడ్డివామి

వేముల : మండలంలోని వేల్పుల పంచాయతీ పరిధిలోని బెస్తవారిపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగు పాటుకు ఆరు పాడి పశువులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గాండ్లపెంట మస్తానమ్మ పాడి పశువులను ఇంటి సమీపంలోని చెట్టుకు కట్టి మేత వేసేవారు. ఈ క్రమంలో మంగళవారం ఈదురు గాలులు వీచడంతోపాటు చెట్టుపైన పిడుగు పడి ఆరు పాడి పశువులు మృతి చెందాయి. సుమారు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డిలు గ్రామానికి చేరుకుని పాడి పశువుల బాధితులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

పిడుగు పడి గడ్డివామి దగ్ధం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో గ్రామానికి చెందిన బాపతి వెంకటేశ్వరెడ్డి గడ్డివామి మంగళవారం మధ్యాహ్నం పిడుగుపడి దగ్ధమైంది. గడ్డివామి విలువ దాదాపు రూ.80 వేలు చేస్తుందని బాధిత రైతు తెలిపాడు.

నేత్రదానం

పులివెందుల రూరల్ : వృద్ధురాలు చనిపోతూ నేత్రదానం చేసి ఇద్దరి అంధులకు చూపు ప్రసాదించిందని నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు తెలిపారు. మంగళవారం పట్టణానికి చెందిన కల్లూరు లక్ష్మీదేవి అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకారం తెలపడంతో మృతురాలి కార్నియాలను సేకరించి హైదరాబాద్ అగర్వాల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99666502364, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మున్సిపాలిటీలో సమస్యల్లేకుండా చూద్దాం

- 150 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం
- మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



పాలనకు సంబంధించిన కరపత్రాలను ప్రదర్శిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో ఎక్కడే కానీ సమస్యలు లేకుండా చూద్దామని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో మోడల్ టౌన్‌కు సంబంధించి అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇంతలా మున్సిపాలిటీలో అభివృద్ధి జరుగుతున్నా.. కొంతమంది విమర్శలు చేస్తున్నారని ఇది సబబు కాదన్నారు. ప్రతి కౌన్సిలర్ తమ వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దీనికి సంబంధించి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్లాస్టిక్‌ను నివారించే దిశగా సంస్థ తరపున గుడ్డ సంచులను అందించారు. మాంసం విక్రయాలకు సంబంధించి ధరలను అదుపులో ఉంచుతామన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో 150 చోట్ల నిఘా నేత్రాలను కూడా ఏర్పాటు చేయనున్నామని.. త్వరలో కెమెరాలను అన్నిచోట్ల ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు తమ వార్డుల్లో మౌలిక వసతులకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే సచివాలయంలో ఒక రికార్డును పెట్టడం జరిగిందని.. అందులో సమస్యను రాయవచ్చునని తెలిపారు. ముఖ్యంగా కోతులు, కుక్కలు ఎక్కువగా ఉండటంవల్ల వాటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని.. దానిపై చర్చించడం జరిగిందన్నారు. పట్టణంలో దాదాపు 8వేల ఇళ్లతో జరుగుతున్న జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి గురించి కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.